
## ఇండియన్‌గా నేర్చుకోవాల్సింది అదే



ప్రజలు కుల, మత భేదాభిప్రాయం లేకుండా ఆనందంగా జీవిస్తున్న భారతదేశంలో కొందరు స్వార్థ రాజకీయాల కోసం మనలో మనకు గొడవలు పెట్టారు. ఇలాంటి చెడు పరిణామాల నుంచి ప్రజలను కాపాడిన వారెందరో ఉన్నారు. అలాంటి మహానుభావుల్లో ఒకడు మొయిద్దీన్ భాయ్. ఈ మొయిద్దీన్ భాయ్ పాత్రలో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన చిత్రం ‘లాల్ సలామ్’. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ నిర్మించారు. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకురాలు. ఈ నెల 9న తెలుగులో శ్రీలక్ష్మీ మూవీస్ విడుదల చేస్తున్నది. ట్రైలర్‌ను చిత్ర యూనిట్ బుధవారం రిలీజ్ చేసింది. ‘మతాన్ని నమ్మితే మనసులో ఉంచుకో.. మానవత్వాన్ని అందరితో పంచుకో.. ఇండియన్‌గా నేర్చుకోవాల్సింది అదే’.. అంటూ రజనీకాంత్ చెప్పే డైలాగ్ అద్భుతంగా ఉంది. విష్ణు విశాల్, విక్రాంత్, జీవితా రాజశేఖర్, మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్ తదితరులు నటిస్తున్న ఈ సినిమాకు కెమెరా: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏఆర్.రెహమాన్.



## రాజమౌళిని షేక్‌స్పియర్‌తో పోల్చిన కామెరూన్

‘‘ఆర్‌ఆర్‌ఆర్’తో రాజమౌళి అద్భుతం చేశారు. ఆయన్ను కలవడం ఎప్పటికీ మర్చిపోలేను. ప్రపంచ వేదికపై ఇండియన్ సినిమాను చూడటం ఆనందంగా అనిపించింది’ అని చెప్పారు హాలీవుడ్ దిగ్గజ దర్శకుడు జేమ్స్ కామెరూన్. 51వ వార్షిక శాటర్న్ అవార్డుల ఫంక్షన్ ఇటీవల అమెరికాలో నిర్వహించగా, జేమ్స్ కామెరూన్ హాజరయ్యారు. గత ఏడాది రాజమౌళితో గడిపిన క్షణాలను ఆయన ఈ వేదికపై గుర్తు చేసుకుంటూ రాజమౌళిని మరోమారు పొగడ్తల్లో ముంచెత్తారు. ఆ వీడియో నెట్టింట సందడి చేస్తున్నది. గతంలో జేమ్స్ కామెరూన్ ‘ఆర్‌ఆర్‌ఆర్’ను మొదటిసారి వీక్షించి ఆశ్చర్యపోయా. గ్రాఫిక్స్‌తోపాటు అన్ని పాత్రలనూ చాలా బాగా చూపించారు. స్టోరీ చెప్పడంలో షేక్‌స్పియర్‌ను తలపించారు’ అని రాజమౌళిని ప్రశంసించారు. అప్పుడు కామెరూన్‌ను కలిసిన రాజమౌళి ‘ఆయన నాతో 10 నిమిషాలు మాట్లాడారంటే నమ్మలేకపోతున్నా. నా డైరెక్షన్‌లో వచ్చిన సినిమాను ఆయన విశ్లేషించి చెప్పడాన్ని జీవితంలో మర్చిపోలేను’ అంటూ ఓ పోస్ట్ చేశారు. మహేశ్‌బాబుతో చేస్తున్న సినిమా పనుల్లో రాజమౌళి ప్రస్తుతం బిజీగా ఉన్నారు. స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. సంగీత చర్చలు జరుగుతున్నాయి.

## వచ్చాడంటే మోతరా.. విధ్వంసాల జాతర..



రవితేజ కథానాయకునిగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘ఈగల్’. టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ట్రైలర్‌లో రవితేజ టెర్రిఫిక్ డైలాగులు, డేవ్‌జాంద్ అద్భుతమైన నేపథ్య సంగీతం సినిమాపై అంచనాలు రెట్టింపు చేసేలా ఉన్నాయని, దానికి తగ్గట్టే సినిమా కూడా ఉంటుందని, ప్రొడక్షన్ డిజైన్ చాలా లావిష్‌గా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ‘వచ్చాడంటే మోతర.. విధ్వంసాల జాతర’ అనే లైన్స్ రవితేజ పాత్ర నైజాన్ని చెప్పకనే చెబుతున్నాయని, ప్రేక్షకులు మునుపెన్నడూ చూడని స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైన్మెంట్‌ని చూడబోతున్నారని నమ్మకంగా చెప్పగలమని చిత్రం బృందం తెలిపింది. కావ్య థాపర్, అనుపమ పరమేశ్వరన్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవదీప్, అవసరాల శ్రీనివాస్, మధుబాల, ప్రణీత పట్నాయక్ ఇతర పాత్రధారులు. కార్తీక్ ఘట్టమనేని ఈ చిత్రానికి దర్శకత్వ బాధ్యతను నిర్వర్తిస్తూనే, మణిబాబు కరణంతో కలిసి రచన అందించడంతోపాటు, కమిల్ ప్లాకి, కర్మ్ చావ్లాలతో కలిసి సినిమాటోగ్రఫీ కూడా అందించారు.

## పుట్టినరోజు హంగామా..



‘డీజే టిల్లూ’గా సిద్ధు జొన్నలగడ్డ చూపించిన గ్రేసూ, హైపర్ యాక్టీవ్‌నెస్ జనాలకు విపరీతంగా నచ్చేసింది. ఆ తరహా పాత్ర అంటే తానే గుర్తొచ్చేంత గొప్పగా నటించారు సిద్ధు. అందుకే ‘టిల్లు స్క్వేర్’కి అంత హైప్. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన రెండు పాటలకు విశేషమైన స్పందన లభిస్తున్నది. సిద్ధు జొన్నలగడ్డ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన గ్లింప్స్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాత్రి సమయంలో కారు నడుపుతూ లిల్లీ పాత్రలో ఉన్న అనుపమ పరమేశ్వరన్ నుంచి ముద్దును పొందడం, తన గత పుట్టినరోజు గురించి లిల్లీ అడగగా రాధికతో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకోవడం ఈ గ్లింప్స్‌లో హైలైట్స్. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ నెల 14న ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేయనున్నట్టు మేకర్స్ ప్రకటించారు. మల్లిక్‌రామ్ దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

ఇదిలావుంటే.. ఈ సినిమా తర్వాత బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు సిద్ధూ. ఆ సినిమాకు ‘జాక్’ అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ‘కొంచెం క్రాక్’ అనేది ఉపశీర్షిక. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ని కూడా సిద్ధు పుట్టిన రోజు సందర్భంలోనే మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమాలోని సిద్ధూ పాత్ర చిత్రణ ఎలా ఉంటుందో చెప్పకనే చెప్పేలా ఉంది ఈ పోస్టర్. డబుల్ గన్.. డబుల్ ఫన్ అనేలా ఈ చిత్రం ఉండబోతుందని, యువతరంతోపాటు ఫ్యామిలీ ఆడియన్స్‌కి కూడా నచ్చేలా బొమ్మరిల్లు భాస్కర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని నిర్మాత చెప్పారు.

## తప్పును నిలదీసే ధీశాలిగా..



తాను హిల్ స్టేషన్ (కూర్గ్) నుంచి వచ్చాను. జీవితంలో ప్రకృతి ఒక భాగం. నిజ జీవితంలో మేము చెట్లు, నదులు, కొండలు, జంతువులను ఆరాధిస్తాం. ‘ఊరు పేరు భైరవ కోన’ సినిమాలో తాను నటించిన పాత్ర నేను రిలేట్ చేసుకునేలా ఉందనే ఓకే చెప్పా’ అని చెప్పుకొచ్చింది వర్ష బొల్లమ్మ. హీరో సందీప్ కిషన్ మ్యాజికల్ ఫాంటసీ అడ్వెంచర్ ‘ఊరు పేరు భైరవకోన’. వీఐ ఆనంద్ దర్శకత్వం వహించారు. కావ్య థాపర్, వర్ష బొల్లమ్మ కథానాయికలు. రాజేశ్ దండా నిర్మాత. ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రానున్నదీ సినిమా. ఈ సందర్భంగా హీరోయిన్ వర్ష బొల్లమ్మ చిత్ర విశేషాలను విలేకరులతో పంచుకున్నారు. ‘దర్శకుడు వీఐ ఆనంద్ గారు కథ చెప్పినపుడు అసలు ఇలాంటి కథ ఎలా ఆలోచించగలిగారో అనిపించింది. ఇందులో భూమి అనే పాత్రలో కనిపిస్తాను. ఆమె ఓ ట్రైబల్ గర్ల్. ఊళ్లో తానొకత్తే చదువుకున్న అమ్మాయి. తప్పును నిలదీసే ధైర్యవంతురాలు. ఇలాంటి పాత్ర గతంలో ఎప్పుడూ చేయలేదు. చేయగలనో? లేదో? అని ఆలోచించుకోవడానికి సమయం పట్టింది. నిడివి తక్కువగా ఉన్నా సినిమాలో ప్రాధాన్యమున్న పాత్రలను చేయడానికే ఆసక్తి చూపిస్తాను. ఇప్పటివరకు చేసినవన్నీ అలా వచ్చినవే. దర్శకుడు ఈ కథ రాసుకున్నప్పుడే భూమి పాత్రకు నన్ను అనుకున్నారని తెలిసి చాలా ఆనందంగా అనిపించింది. ఈ సినిమా ప్రేక్షకులకు ఎడ్జ్ ఆఫ్ ది సీట్ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది’ అని అన్నారు. ఇంకా తన అప్ కమింగ్ ప్రాజెక్ట్స్ గురించి చెప్తూ.. ‘ఒక మంచి ప్రాజెక్ట్ చేస్తున్నా. దాని గురించి నిర్మాతలు త్వరలో తెలియజేస్తారు. తెలుగు, తమిళం, మలయాళంలో సినిమాలు చేశాను. త్వరలో కన్నడలోనూ చేసే అవకాశం ఉంది’ అని తెలిపింది.

## ‘గామి’ నా కెరీర్‌కే ప్రత్యేకం



‘ దర్శకుడు విద్యాధర్ ‘గామి’ కోసం చాలా రీసెర్చ్ చేశాడు. ప్రతి ఎలిమెంట్‌నీ లోతుగా అధ్యయనం చేసి రాసుకున్నాడు. దాదాపు నాలుగున్నరేళ్లు కష్టపడి ఈ సినిమా చేశాం. ఇంత సమయం తీసుకున్నాం కాబట్టే మంచి సీజీని రాబట్టుకోగలిగాం.’ అన్నారు హీరో విశ్వక్‌సేన్. ఆయన కథానాయకుడిగా విద్యాధర్ కాగిత దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం ‘గామి’. కార్తీక్ శబరీశ్ నిర్మాత. మార్చి 8న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విశ్వసేన్ మాట్లాడారు. ‘వారణాసిలో ఈ సినిమా షూటింగ్ చేస్తూనే ‘ఫలక్‌నామా దాస్’ టీజర్ ఎడిట్ చేస్తుండేవాడ్ని. ఈ నాలుగున్నరేళ్లలో చాలా సినిమాలు చేసేశాను. నా కెరీర్‌లో ఇది స్పెషల్ మూవీ. కుంభమేళాలో ఈ సినిమా షూటింగ్ చేశాం. కొందరు నేను అఘోర అనుకొని ధర్మం చేశారు. వారణాసిలో చలికి వణుకుతూ ఓ మూలన కూర్చున్నప్పుడు ఓ ముసలామె భోజనం పెట్టి టీ ఇచ్చింది. ఇలా ఎన్నో అనుభవాలు. ట్రైలర్ మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. సినిమా కూడా నచ్చుతుందని అనుకుంటున్నా’ అన్నారు విశ్వక్‌సేన్. మానవస్పర్శే సమస్యగా మారిన ఓ అఘోరా హిమాలయాల్లో చేసే సాహసోపేత ప్రయాణమే ఈ సినిమా అని, అఘోర శంకర్‌గా ఇందులో విశ్వక్‌సేన్ అద్భుతంగా నటించాడని దర్శకుడు విద్యాధర్ చెప్పారు. ఇంకా నిర్మాత కూడా మాట్లాడారు. చాందిని చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నరేశ్ కుమారన్, కెమెరా: విశ్వనాథ్‌రెడ్డి.



## హృదయాన్ని గిచ్చీ గిచ్చక.. ప్రాణాన్ని గుచ్చీ గుచ్చక..



పరశురామ్, విజయ్ దేవరకొండ కాంబోలో వచ్చిన ‘గీతగోవిందం’ ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. వీరిద్దరి కాంబినేషన్‌ని రిపీట్ చేస్తూ అగ్ర నిర్మాతలు దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్న చిత్రం ‘ఫ్యామిలీ స్టార్’. మృణాల్‌ఠాకూర్ కథానాయిక. ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ‘నందనందనా..’ అంటూ సాగే ఈ సినిమాలోని తొలిపాటను బుధవారం మేకర్స్ విడుదల చేశారు. అనంత శ్రీరామ్ రాయగా, గోపీసుందర్ స్వరపరిచిన ఈ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించారు. ‘ఏమిటిది.. చెప్పీ చెప్పనట్టుగా ఎంత చెప్పిందో.. సూచనలు ఇచ్చీ ఇవ్వనట్టుగా ఎన్నెన్నిచ్చిందో.. హృదయాన్ని గిచ్చీ గిచ్చక.. ప్రాణాన్ని గుచ్చీ గుచ్చక.. చిత్రంగా చెక్కింది దేనికో..’ అంటూ సాగిన లిరిక్ యువతరాన్ని కట్టిపడేసేలా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ పాట ‘ఫ్యామిలీస్టార్’ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: కేయూ మోహనన్.

## 37 రూపాయలతో ముంబయికి వచ్చా..



*బహుముఖ నటుడు అనుపమ్ ఖేర్ రాబోతున్న చిత్రం ‘కుచ్ ఖట్టా హో జాయ్’. ఇది ఆయనకు 540వ సినిమా. ట్రైలర్ బుధవారం విడుదలైంది. ఈ సందర్భంగా అనుపమ్ ఖేర్ నటుడిగా తన 40 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. ‘నా కెరీర్‌లో అనేక అంతర్జాతీయ చిత్రాలు చేశాను. ఆ క్రమంలో పలు విమర్శలు ఎదుర్కొన్నాను. ప్రేక్షకులు విసిరిన రాళ్లతో నిర్మించుకున్న కోట నా జీవితం’ అని చెప్పారు అనుపమ్. తన కెరీర్ హెచ్చుతగ్గుల గురించి చెప్తూ.. ‘ఒడిదుడుకులను ఎదుర్కొంటేనే జీవితంలోని ఆనందం అర్థమవుతుంది. ఎలాంటి అడ్డంకులు లేకుండా సాఫీగా సాగితే అది ప్రయాణమే కాదు. కష్టాలు ఉండాలి. ఎత్తు పల్లాలు ఉండాలి.. అప్పుడే జీవితాన్ని ఆస్వాదిస్తాం. 1981లో కేవలం 37 రూపాయలతో ఈ నగరానికి వచ్చాను. ఈ రోజు నా 540వ చిత్రం గురించి మాట్లాడుతున్నాను. ఇంత కన్నా ఆ దేవుడిని ఏం అడగాలి?’ అన్నారు. జి.అశోక్ దర్శకత్వం వహించిన ‘కుచ్ ఖట్టా హో జాయ్’ ఈ నెల 16న విడుదల కానున్నది.*

## గౌతమ్ కృష్ణ ‘సోలో బాయ్’



*బిగ్‌బాస్ 7వ సీజన్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా సెవెన్ హిల్స్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న చిత్రం ‘సోలో బాయ్’. సతీశ్ నిర్మాత. పి.నవీన్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. గౌతమ్‌కృష్ణతో కలిసి శ్వేతా అవాస్థి, రమ్య పసుపులేటి లీడ్ రోల్స్ చేస్తున్నారు. మేకర్స్ బుధవారం టైటిల్ అనౌన్స్‌మెంట్ చేసి ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ.. ‘ఈ కథకు ఈ జనరేషన్ ఈజీగా కనెక్ట్ అవుతారు. రెండు పాటలు మినహా మిగతా సినిమా షూటింగ్ పూర్తయింది’ అని తెలిపారు. ‘తెలుగు ప్రేక్షకులకు మంచి టేస్ట్ ఉంది. గతంలో ‘ఆకాశవీధిలో’ చేసినపుడు నాకు మంచి గుర్తింపు వచ్చింది. ఇప్పుడు ‘సోలో బాయ్’గా వస్తున్న నన్ను ఆదరిస్తారనుకుంటున్నా’ అని అన్నారు హీరో గౌతమ్‌కృష్ణ. అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ చిత్రం అలరిస్తుందని దర్శకుడు చెప్పారు.*



## ఆరేళ్ల వ్యవధిలో జరిగిన ఓ జంట కథ..

‘నేను పుట్టిందీ పెరిగిందీ హైదరాబాద్‌లోనే. కల్చరల్ యాక్టివిటీస్ అంటే చిన్నప్పట్నుంచీ ఇంట్రస్ట్. స్కూల్, కాలేజ్ ఈవెంట్స్‌లో కూడా యాక్టివ్‌గా పార్టిసిపేట్ చేసేదాన్ని. సంగీతం నేర్చుకున్నాను. పాటలు పాడతాను. 2018లో మిస్ హైదరాబాద్‌గా సెలక్టయ్యాను. ఆ తర్వాత సినిమా ఆఫర్లు వచ్చాయి. కళలంటే ఇష్టమున్నా కథానాయికను అయ్యింది మాత్రం యాదృశ్చికంగానే’ అంటున్నారు యువకథానాయిక శ్రీగౌరిప్రియ. ఆమె కథానాయికగా నటించిన తమిళ చిత్రం ‘లవర్’. మణికందన్, కన్న రవి ప్రధానపాత్రధారులు. ప్రభురామ్ వ్యాస్ దర్శకుడు. నజేరత్ పసీలియన్, మగేష్ రాజ్ పసీలియన్, యువరాజ్ గణేశన్ నిర్మాతలు. ఈ నెల 9న విడుదల కానున్న ఈ సినిమాను, దర్శకుడు మారుతి, యువనిర్మాత ఎస్‌కేఎన్ ‘ట్రూ లవర్’ పేరుతో తెలుగులో అనువదించి, ఈ నెల 10న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీగౌరిప్రియ బుధవారం మీడియాతో ముచ్చటించారు. వైజయంతీమూవీస్ వారి ‘మెయిల్’ వెబ్‌సిరీస్ తనకు మంచి గుర్తింపు తెచ్చిందని, రైటర్ పద్మభూషణ్, మ్యాడ్ సినిమాలు థియేటర్లలో కూడా బాగా ఆడి తన కెరీర్‌ని నిలబెట్టాయని శ్రీగౌరిప్రియ పేర్కొన్నారు. ‘మోడరన్ లవ్ చెన్నై’ వెబ్ సిరీస్ ద్వారా తమిళ ప్రేక్షకులకు కూడా చేరువయ్యే అదృష్టం కలిగిందని, ఆ సిరీస్ వల్లే ‘ట్రూ లవర్’ అవకాశం తలుపు తట్టిందని శ్రీగౌరిప్రియ తెలిపారు. ఇంకా చెబుతూ ‘ఇందులో నా పాత్ర పేరు దివ్య. ఓ జంట మధ్య ఆరేళ్ల కాలంలో జరిగిన కథ ఇది. దర్శకుడు ప్రభురామ్ విభిన్నంగా ఆలోచించి నిజానికి దగ్గరగా ఈ కథ తయారు చేశారు. మంచీచెడు అనేవి సందర్భాన్ని బట్టి ఉంటాయి. ఒక అబ్బాయిని అమ్మాయి చూసే పర్సెప్షన్, అమ్మాయిని అబ్బాయి చూసే పర్సెప్షన్ వేరు వేరు సందర్భాల్లో ఎలా ఉంది? తద్వారా ఎదురైన పరిణామాలేంటి? అనేది ఈ చిత్ర కథ. ఇందులోని నా పాత్రలో చాలా షేడ్స్ ఉంటాయి. ఆ కేరక్టర్‌ని అర్థం చేసుకోడానికి కాస్త టైమ్ తీసుకున్నాను. ఈ సినిమాను తెలుగులో విడుదల చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. తెలుగు నిర్మాతలైన మారుతి, ఎస్‌కేఎన్‌గారికి థ్యాంక్స్’ అన్నారు శ్రీగౌరిప్రియ.